ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
మంగళవారం 30 జనవరి 2024



ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు

- బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లోనూ చాన్స్ ఇవ్వకుండా ఎత్తుగడలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- మంత్రులు కొండా, పొంగులేటికి వరంగల్, మహబూబాబాద్ స్థానాల బాధ్యతలు
- ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం

వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇంచార్జులుగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు, కీలక నేతలకు అప్పగించింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో విజయంపై సమీక్షలు నిర్వహిస్తు పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. దీంతో ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ కసరత్తు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీ సీట్లపైనే హస్తం ఫోకస్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, కనీసం 12 స్థానాలైన గెలువాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీగా మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఇటీవల స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో సమీక్ష కూడా నిర్వహించారు. రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాలు రూపొందించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6,63,556 ఓట్లు పొందగా, బీఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 2,41,987 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో ఈసారి వరంగల్ ఎంపీ సెగ్మెంట్‌లో పాగా వేయడం పెద్ద కష్టం కాదనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లను పొందగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు పోలయ్యాయి. ఇక బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 2,30,188 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో కాంగ్రెస్‌కు భారీగా ఓటు బ్యాంకు పెరగడంతో ఎంపీ ఎన్నికల్లో గెలుపై ధీమాగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోటీ ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది.

అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీ కొంత ప్రభావం చూపించింది. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తుంది. అయితే పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ కూడా అడుగుతుంది. అయితే దీనిపై ఎలాంటి స్పష్టత లేకున్నప్పటికీ రెండు ఎంపీ సీట్లను మాత్రం పక్కాగా గెలుచుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై...

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిసెంబరు 9న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జూన్ 8వ తేదీ వరకు ఉప ఎన్నికకు గడువుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఏప్రిల్ నెల లేదంటే జూన్ మొదటి వారంలోనే ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా, నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.

2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్

మిగతా 7వ పేజీలో..



అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ నియోజకవర్గాలు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	07	6,63,556	4,33,368	1,56,638
మహబూబాబాద్	07	6,85,897	4,43,910	34,431

కాంగ్రెస్‌కు తొలి సవాల్...

గత ఏడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్ ఎదుర్కోనుంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో తన మిత్రపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలు జాడ లేకుండా పోయాయి. అయితే ఇది ఒక వర్గానికి సంబంధించిన ఎన్నికలే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఫిబ్రవరిలో మరో హామీని కూడా అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. మార్చి, ఏప్రిల్ నాటికి మిగతా రెండు హామీలను కూడా అమలు చేసి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ ఉంది. పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపుతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు ఇచ్చే తీర్పు ఇదే కావటంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి.

గ్రీవెన్స్‌తో సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ చెలికట్టి శివలింగయ్య



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 29: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెలికట్టి శివలింగయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 62 మంది నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఇందులో మెజారిటీగా రెవెన్యూ శాఖ పరిధిలోనివే వచ్చినట్లు ఆయన చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. తనకు మీ సేవ మంజూరు చేయాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మండలానికి చెందిన గాదె చిట్టిబాబు అర్జీ పెట్టుకున్నారు. సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని కోరుతూ రఘునాథపల్లికి చెందిన బి.సందీప్ వినతిపత్రం ఇచ్చారు. తనకు దక్కాల్సిన మూడెకరాల వ్యవసాయ భూమిని తన మరువన్న తల్లి దొంగ పట్టా చేయించుకున్నారని, దానిని రద్దు చేయాలని కోరుతూ రఘునాథపల్లి మండలం ఫతేషాపురం గ్రామానికి చెందిన గడ్డం ఆనందం వినతిపత్రం అందజేశారు. బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన నల్ల శ్రావణ్‌కుమార్ తనకు పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని వేడుకున్నారు. పోచన్నపేట శివారులో గల 528 సర్వే నంబర్ గల భూమిలో అసైన్‌మెంట్ ప్రకారం కొలతలు చేస్తుండగా భూమికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి అడ్డుకున్నారని వారి నుంచి ప్రాణభయం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. బచ్చన్నపేట మండలం చిన్న రాంచర్ల కు చెందిన రత్నపురం లలిత తన పాస్‌బుక్‌లు గుంజుకున్నారని దరఖాస్తు చేసుకున్నారు. భర్త మల్లేశం ఆర్మీలో సైనికుడిగా పనిచేయడంతో 1993లో పోచన్నపేటలో ఐదెకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ భూమిలోనే మేం వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని రెవెన్యూ అధికారులు పట్టా పాస్‌బుక్ సవరణ పేరుతో తీసుకున్నారని తెలిపారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఇవ్వడం లేదన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఆర్డీవోలు మురళీకృష్ణ, రాంమూర్తి, డీఆర్‌డీవో మొగులప్ప, సీపీవో ఇస్మాయిల్, డీఈవో రాము, డీపీవో రంగాచారి, డీడబ్ల్యూవో జయంతి తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేవరుప్పుల, జనవరి 29: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు, కళారత్న, హంస, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సోమవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సమ్మయ్య మన తెలంగాణ వారు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా సినీనటుడు చిరంజీవి పద్మశ్రీ పొందిన సమ్మయ్యను బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ పద్మశ్రీకి ఎంపికైన సమ్మయ్య కళలకు ఆజ్యం పోశాడని తెలిపారు. కార్యక్రమంలో సమ్మయ్య కుమారులు సోమరాజు, హిమగిరి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కడియంకు లేదు : యశస్వినిరెడ్డి



పాలకుర్తిలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జనవరి 29 : సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డితో కలిసి యశస్వినిరెడ్డి మాట్లాడారు. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి పాటుపడకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేసిందని విమర్శించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను విమర్శించే స్థాయి కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని అన్నారు. అధికారంలోకి రెండు నెలలు కూడా పూర్తికాకముందే రేవంత్‌రెడ్డి సర్కారుపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. 75 శాతం మందికి రైతులకు రైతుబంధు డబ్బులు వారి ఖాతాల్లో జమ చేశారని, మిగితా ఫిబ్రవరి నెలాఖరు వరకు రాష్ట్రంలోని రైతులందరికి రైతుబంధు డబ్బులు

మిగతా 8వ పేజీలో...

మేడారంలో భక్తుల సందడి

ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్న 20 వేల మంది



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 29 : తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చి మహాజాతరకు ముందుగానే వనదేవతలను దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది సమ్మక్క, సారలమ్మల సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం)తో మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రసాదం లేకుండానే...

మహా జాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులకు ప్రసాదం దక్కడం లేదు. దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్న తమకు నిరాశే ఎదురవుతోందని భక్తులు అంటున్నారు. వనదేవతలకు గద్దెల వద్ద బంగారం (బెల్లం) సమర్పించిన అనంతరం దానిని ప్రసాదంగా అందించాల్సి ఉండగా పూజారులు తమకు ఇవ్వడం లేదని అంటున్నారు. భక్తిశ్రద్ధలతో తల్లులకు పూజలు చేసిన అనంతరం ప్రసాదం లేకుండానే తిరిగి వెళ్తున్నామని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 29 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధిఆరులను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె సోమవారం మేడారంలో పర్యటించారు. గద్దెల పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఇంకొన్ని రోజుల్లోనే మహాజాతర జరగనుందని, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఆమె వెంట ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

- నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన
- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా
- నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త వారికి త్వరలో నోటిఫికేషన్

వివరాలు 7లో

అవినీతిని సహించను..!

అలాంటి అధికారులు ఉంటే వెళ్లిపోవచ్చు

మండల సభకు సమగ్ర సమాచారంతో రావాలి

ప్రత్యేక మండలసభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాలఘణపురం మండల ప్రత్యేక మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం, జనవరి 29: ఎట్టి పరిస్థితుల్లో కూడా తాను అవినీతిని సహించబోనని అలాంటి అధికారులంటే తన నియోజకవర్గం నుంచి బదిలీ చేసుకుని వెళ్లిపోవచ్చని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను హెచ్చరించారు. లింగాలఘణపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును ఉద్దేశిస్తూ గడిచిన 30 ఏళ్లుగా రాష్ట్రస్థాయిలో కీలకమైన మంత్రిత్వ శాఖల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవం ఉందన్నారు. ఎక్కడ కూడా అవినీతికి పాల్పడకుండా ప్రజల కోసం నిఖార్సుగా పనిచేశాననే తప్ప అక్రమంగా సంపాదించే ప్రయత్నం చేయలేదన్నారు. ఒకవేళ తాను అలా చేసి ఉంటే ఇప్పటికే వేలాది ఎకరాల భూములను కొనుగోలు చేసేవాడినని, జనగామ జిల్లాను కొనుగోలు చేసే సామర్థ్యం తనకుండే దన్నారు. కానీ తాను ఏనాడు అలాంటి తప్పుడు పనులు చేయలేదన్నారు. ఎవరైనా కొద్దో గొప్పో అవినీతికి పాల్పడే అధికారులు ఉంటే ఇక్కడి నుంచి నిరభ్యంతరంగా బదిలీ చేసుకొని వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను బెదిరించినట్లో లేక భయపెట్టినట్లో తీసుకోవద్దని ప్రజా సేవ కోసం అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు బృందంగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి టీమ్ వర్క్ చేద్దామన్నారు. సమావేశంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, తహసీల్దార్ వినయలత, ఎంపీడీవో సురేందర్‌నాయక్, వైస్‌ఎంపీపీ కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పాడి భారం

- అంతరించి పోతున్న పశు సంపద
- జిల్లాలో తగ్గుతున్న ఆవులు, గేదెలు
- పోషించలేక అమ్ముకుంటున్న రైతులు
- పశువుల కొనుగోళ్లను ప్రోత్సహించని ప్రభుత్వం



పాడి పంటలు గ్రామాలకు సిరుల కుండలు.. ప్రస్తుత రోజుల్లో మాత్రం చిల్లులు పడిన కుండల్లా మారుతున్నాయి. కరువు, పెరిగిన పెట్టుబడులు, తగ్గిన పాల ధరలు.. వెరసి పశుపోషణ భారమైంది. బిడ్డల్లాంటి గొడ్లను అమ్మేసుకుని.. పోషకులు పాడికి దూరమవుతున్నారు. ఓ వైపు అనుబంధ రంగాల ఉన్నతికి ప్రభుత్వం చర్యలు చేపడతున్నా వాస్తవ పరిస్థితులు మాత్రం విరుద్ధంగా ఉన్నాయి.

పాలకుర్తి, జనవరి 29 : ఒకప్పుడు పల్లెల్లో ప్రతి రైతు పశువుల కొట్టం నిండా ఆవులు, గేదెలు ఉండేవి. వాటి కోసం ప్రత్యేకంగా కొట్టాలు నిర్మించేవారు. ఏ రైతు పశువుల కొట్టంలో చూసినా పది కంటే ఎక్కువ పశువులు కనిపించేవి. ప్రస్తుతం గతానికి భిన్నంగా పరిస్థితులు పూర్తిగా మారాయి. రైతులు పశువులను పోషించలేక అమ్ముకుంటున్న పరిస్థితి. ఇప్పటికే గ్రామాల్లో నూటికి యాభై శాతం మంది రైతులు పశువులను పోషించలేని వ్యవసాయాన్ని కౌలుకు ఇస్తున్న దుస్థితి ఉంది. జనగామ జిల్లాలో ఇప్పటికి పశు సంపద రోజు రోజుకు తగ్గుముఖం పడుతోంది. 2012 సంవత్సరంలో చేసిన పశుగణన వివరాలను 2019 సంవత్సరంతో పోల్చి చూస్తే ఆవులు, ఎడ్లు కలిపి మొత్తం 1 లక్షా 19 వేలు ఉండగా, గేదెలు, సంఖ్య కూడా 1 లక్షా 1800 లు మాత్రమే ఉన్నాయి. జిల్లాలో దీంతో పాలు అమ్మే రైతులపై కూడా ఈ ప్రభావం పడుతుంది.

శ్రమించే రైతులు తగ్గిపోయారు

వ్యవసాయంలో శ్రమించే రైతులు రోజురోజుకు తగ్గిపోతున్నారు. పశుపోషణతో వాటి సంపదను పెంచడానికి పాడి రైతులు కష్టపడి పనిచేస్తలేరు. పాలిచ్చే పశువులను చూస్తున్నారే తప్ప వాటికి కావల్సిన ఆహారం (గ్రాసం) అందించలేని పరిస్థితి. స్వయంగా పాడి పశువులను చూసుకోవడం భారంగా భావించిన చాలామంది రైతులు పాలేరులను ఏడాది వరకు మాట్లాడుకు ంటున్నారు. పాలేర్లు పశువులను పోషించలేక మధ్యలోనే వెళ్లిపోతున్నారు. దీంతో రైతులు పాలేర్లను మందలించే పరిస్థితి లేకపోవడంతో పశువులను అమ్ముకుంటున్నారు. పశువులకు మేత (గ్రాసం) లభించడం లేదు . రైతులకు వ్యవసాయ శాఖ 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందజేస్తున్నా రైతులు సద్వినియోగం చేసుకోవడానికి ఆసక్తి చూపడంలేదని సత్యం. జిల్లాలో మొత్తం 7 చిన్న తరహా పాల శీతలీకరణ కేంద్రాలు, ఒక పాల శీతలీకరణ కేంద్రం విజయ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. విజయ పాడి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. పెళ్లి కానుక పడిరైతు కుటుంబానికి పెళ్లి కానుకగా రూ. 5 వేలు చొప్పున ఇప్పటి వరకు 178 మంది రైతులకు రూ 8 లక్షల 90 వేలు లబ్ధి పొందారు. రైతులకు పాడి రైతులు సంఖ్య కేవలం వేల సంఖ్యలోనే ఉంది. ప్రైవేటు డెయిరీలకు గ్రామాల్లో హోటళ్లలో, ఇండ్లలో పాలను అమ్మే రైతులు పోను, విజయ డెయిరీ పాలను విక్రయించే వారి సంఖ్య 5, 500 మంది రైతుల ద్వారా రోజుకు జిల్లాలో 39,500 లీటర్ల పాల సేకరణ జరుగుతున్నట్లు సమాచారం.

యువ రైతులు ముందుకు వస్తే..

జిల్లాలో పశు సంపదను పెంపొందించాలంటే యువ రైతులు ముందుకు రావాల్సి అవసరం ఉంది. పశు పోషణలో మెళకువలు నేర్చుకొని డెయిరీ రంగంలో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని, మెళకువలు నేర్చుకొని ప్రభుత్వం నుంచి రుణాలు పొంది డైరీని స్థాపిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా వ్యవసాయ రంగం, ఇటు పశు సంపద సైతం అభివృద్ధి చెందుతుంది.

జిల్లాలో 39,500 లీటర్ల పాల సేకరణ..

-జి.ధన్‌రాజ్, పాడిపరిశ్రమ సహకార సమాఖ్య లిమిటెడ్ డిప్యూటి డైరెక్టర్ జనగామ జిల్లా



ప్రభుత్వం రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. పాడి రైతు కుటుంబానికి పెళ్లి కానుకగా రూ. 5 వేల చొప్పున ఇప్పటివరకు జిల్లాలో 178 మంది రైతులకు రూ. 8 లక్షలు 90 వేలు రైతులు లబ్ధి పొందారు. జిల్లాలో మొత్తం 5,500 మంది రైతుల ద్వారా 39,500 లీటర్ల పాలను సేకరిస్తున్నాం.

ముగిసిన అన్నారం ఉర్సు


దర్గాలో పూజలు చేస్తున్న ముజావర్లు

పర్వతగిరి, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు చివరి రోజైన సోమవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన వేడుకల్లో చివరి రోజు ఖత్‌మల్ ఖురానా (ఖురాన్ పఠనం)తో ముగిసాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్కాలర్స్ వినతి

కేయూ క్యాంపస్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇప్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి కేయూ పరిశోధకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉషన్‌నాయక్, కళ్లెపల్లి ప్రశాంత్‌ల నేతృత్వంలో సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ..వర్సిటీల పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతకు ఫెల్లోషిప్‌లు దోహదపడుతాయని అన్నారు. ఒడిస్సా, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు సీఎం రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకం క్రింద ఫెల్లోషిప్‌లు ఇస్తున్నాయని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కుర్సా నాయకులు తెలిపారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, ప్రశాంత్

ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ జానకి రామ్, కోశాధికారి అంగడి సతీశ్, ఈసీ మెంబర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య


మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు, జనవరి 29: హనుమకొండ ఫాతిమానగర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఐనవోలులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఫాతిమానగర్ బాలవికాస్‌లో జరుగుతాయని తెలిపారు.

ఈ సమావేశాల్లో కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. 31న బహిరంగ సభ ఉంటుందని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ కార్మిక ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసమావేశాల్లో బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేన, ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య, మేకిరి మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ఆచార్య రమేశ్

మరణ సందేశం పుస్తకావిష్కరణ

వడ్డేపల్లి, జనవరి 29: సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ రాసిన మరణ సందేశం పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్ సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆవిష్కరించారు. తొలుత జర్నలిస్టు గౌరీ లంకేష్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రమేశ్ మాట్లాడుతూ మరణ సందేశం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు.

ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, అంతడుపుల శ్రీనివాస్, బండి మొగిలి, ప్రజాసంఘాల నాయకులు నల్లెల్ల రాజయ్య, రమేశ్‌రాజా, కోగిల చంద్రమౌళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

▶▶ 5వ పేజీ తరువాయి

నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తీన్మార్ మల్లన్న, కోదండరాంలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండడంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. తన నియోజకవర్గ పరిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. పది రోజులుగా పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన ఎంపీ, ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవటంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది.



టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన

- ▶▶ జారీ అయిన ఉత్తర్వులు
- ▶▶ నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ▶▶ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- ▶▶ కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) ఎట్టకేలకు ప్రక్షాళన మొదలైంది. గత పదేళ్లుగా పాతుకు పోయిన నలుగురు డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌పీడీసీఎల్‌తో పాటు టీఎస్ఎస్పీడీసీఎల్‌లోని ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగించారు. దీంతో ఒక్క కలంపోటుతో మొత్తం పదకొండు మంది డైరెక్టర్లు ఇంటిదారి పట్టారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టుగా ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇక వీటికి మంచి రోజులు వచ్చినట్టేనని విద్యుత్ వినియోగదారులు, వాటిలో పని చేస్తున్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన షురూ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న ప్రత్యేకం కథనం వచ్చింది. చెప్పినట్టుగానే డైరెక్టర్ల తొలగింపు జరిగింది.

వేటు పడిన డైరెక్టర్లు

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో వేటు పడిన డైరెక్టర్లలో బి.వెంకటేశ్వర్ రావు (హెచ్ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు), పి.సంధ్యారాణి (కమర్షియల్), పి గణపతి (ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ) ఉన్నారు. బి.వెంకటేశ్వర్ రావు మినహా మిగతా ముగ్గురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నలుగురు నిబంధనలకు వ్యతిరేకంగా చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నందు వల్లనే వారిని తొలగించినట్టు పేర్కొన్నారు. బి.వెంకటేశ్వర్ రావు (డైరెక్టర్ హెచ్ఆర్) 2013 జులై 31న నియమితులయ్యారు. 10 సంవత్సరాల 5 నెలల పాటు కొనసాగారు. వెంకటేశ్వర్ రావు 2007లో సీఈగా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత అయిదేళ్లకు డైరెక్టర్ అయి అప్పటి నుంచి కొనసాగుతూ వస్తున్నారు. పి.మోహన్‌రెడ్డి (డైరెక్టర్ -పాజెక్టులు) 2018 సెప్టెంబరు 5 తేదీన నియమితులయ్యారు. 5 సంవత్సరాల 4 నెలలుగా ఆయన కొనసాగుతు న్నారు. ఈయన 2006లో సీఈగా రిటైర్ అయ్యారు. మోహన్‌రెడ్డికి 2009లో ఒక సారి, 2011లో రెండో సారి, 2018లో ముచ్చ టగా మూడో సారి ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.పి.సంధ్యారాణి (డైరెక్టర్-కమర్షియల్) 2018 సెప్టెం బరు 5న నియమితులయ్యారు. ఆమె కూడా 5 సంవత్సరాల 4 నెలలుగా కొనసా గుతున్నారు. ఈమే 2021లో సీఈగా రిటైర్ అయ్యారు. అయితే 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగి హోదా లో డైరెక్టర్ గా కొనసాగుతూ వచ్చారు. అలాగే పి.గణపతి (డైరెక్టర్- ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ) కూడా 2018 సెప్టెంబరు 5న నిమితులై గత 5 ఏళ్ళ 4 నాలుగు నెలలుగా కొనసాగుతు న్నారు. ఈయన 2014 ఆగస్టులో రిటైర్ కావలసి ఉన్నది. 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగిగా డైరెక్టర్ హోదాలో కొనసాగుతూ వచ్చారు.



గత సీఎండీ గోపాల్‌రావుతో ప్రస్తుతం తొలగింప బడిన డైరెక్టర్లు

నాలుగేళ్లు మించకూడదు

సాధారణంగా ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లుగా విద్యుత్ సంస్థల్లో సీఈ హోదాలో రిటైర్ అయిన వారిని లేదా ఇంకా రెండేళ్లలో రిటైర్ కానున్న ఇన్‌సర్వీస్ ఉద్యోగులను డైరెక్టర్లుగా నియమిస్తారు. డైరెక్టర్లను తొలుత రెండేళ్ల కాలపరిమితితో మాత్రమే నియమించాలి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి వారి కాలపరిమితిని మరో ఏడాది పొడిగించవచ్చు. గరిష్టంగా రెండు సార్లు మాత్రమే వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి. ఏ డైరెక్టర్ అయిన నాలుగేళ్లకు మించి పని చేయరాదు. కానీ ఎన్‌పీడీసీఎల్‌లో ఇందుకు విరు ద్ధంగా డైరెక్టర్లకు ఇష్టారీతిన పొడిగింపులు ఇస్తూ వెళ్ళారు. వెంకటేశ్వర్‌రావు (డైరెక్టర్-హెచ్ఆర్‌ఏ) గత పదేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీ కాలంలో నలుగురు సీఎండీలు మారారు. ఎన్‌పీడీసీఎల్‌లో మొత్తం అయిదుగురు డైరెక్టర్లలో ఈ నలుగురు పోను మరో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఎకౌంట్స్)గా పని చేస్తున్న తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్ మాత్రమే. అంతకు ముందు పని చేసిన డైరెక్టర్ పదవీ కాలం ముగియడంతో ఆయన బాధ్యతలను తిరుపతి రెడ్డికి అప్పగించారు.

టీఎస్ఎస్పీడీసీఎల్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్పీడీసీఎల్)లోనూ ప్రస్తుతం సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న మరో ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగిస్తూ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. జె.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్-ఆపరేషన్స్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్-ప్రాజెక్టులు), కె రాములు (డైరెక్టర్ కమర్షియల్, డీపీఈ, అసెస్‌మెంట్ అండ్ ఎనర్జీ ఆడిట్), జి.పర్వతం (డైరెక్టర్-హెచ్ఆర్ అండ్ ఐఆర్) సీహెచ్ మదన్ మోహన్ (డైరెక్టర్ పీఅండ్ఎంఎం) ఎస్.స్వామిరెడ్డి (డైరెక్టర్-ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ), గంపా గోపాల్ (డైరెక్టర్,ఈ ఆడిట్, డీపీఈ అండ్ అసెస్‌మెంట్) వీరిలో ఉన్నారు. వీరిలో జె.శ్రీనివాస్ రెడ్డి 9 సంవత్సరాలు 2 నెలలుగా, టి శ్రీనివాస్ 10 సంవత్సరాల 5 నెలలుగా కొనసాగుతున్నారు. మిగతా వారంతా 5 సంవత్సరాల 5 నెలలుగా పని చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకం త్వరలో జరగవచ్చునని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.



మహాజాతరను విజయవంతం చేద్దాం..

- ▶▶ అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలి
- ▶▶ ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, జనవరి 29 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహాజాతరను విజయవంతం చేసేందుకు అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఈవో రాజేందర్ ఆధ్వర్యంలో మేడారంలో ఈ సమావేశం జరిగింది. మహాజాతరను విజయవంతం చేయడా నికి చేపడుతున్న కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూజారులు, అధికారులు సమన్వయంగా జాతరను విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

పూజా కార్యక్రమాలు, వాటికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును అడిగి తెలుసుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా పగిడిద్దరాజును తీసుకొచ్చే సమయంలో పోలీసు రోప్ పార్టీల ద్వారా భద్రత కల్పించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవార్లను తీసుకొచ్చే సమయంలో మూడంచల భద్రత అవసరం ఉంటుందన్నారు. వనదేవతల పూజారులకు ఎండోమెంట్ ద్వారా శాశ్వత గదులు కేటాయించాలన్నారు.

దేవస్థానం కోసం కేటాయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పూజారులకు వసతి, సౌకర్యాలు కల్పిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, పూజారులు వెంకటేశ్వరు, గోవర్ధన్, ప్రభకర్, నర్సింగరావు, భోజరావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణచందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సన్నద్ధం : ఎస్పీ శబరీశ్

ములుగు, జనవరి 29: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను విజయవం తంగా జరిపించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమ వుతోందని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడతామని అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కుంభమేళా స్థాయిలో జరిగే మేడారం జాతర నిర్వహణ బాధ్యత పోలీసు శాఖ ద్వారా తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామ న్నారు. గత జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, భక్తులు, వీఐపీల రక్షణపై దృష్టి సారించామని తెలిపారు. సాధ్యమైనంత వరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జాతర నిర్వహణలో ప్రజలు పోలీసు శాఖకు సహకారం అందించాలని ఆయన కోరారు.





దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు దరఖాస్తు ఫారాలను ఆయన పట్టభద్రులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో జరుగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల్లోని పట్టభద్రులందరు ఓటు నమోదు ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, ఉపేందర్‌రెడ్డి, రాజు, అశోక్‌రావు, రాజు, చంద్రమోహన్, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజేందంర్‌రెడ్డి, సోమేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ సిటీ, జనవరి 29: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుచేస్తున్న యాసంగి వరిలో కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతి పెరుగుతుండటంతో రైతులు తీసుకోవాల్సిన పలు సస్యరక్షణ చర్యలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, యు. నాగభూషణం, ఎం.విశ్వతేజ క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి వరి పొలాలు, నారుమళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు, సూచనాలు అందజేశారు. పురుగుల ఉధృతిని గమనిం చడానికి దీపపు ఎర, సోలార్ ఎర, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వరి పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసి అందులో వారానికి బుట్టలో 25-30 పురుగులు పడినప్పుడు పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



నారాయణగిరిలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు





ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

టీచర్‌గా మారిన అడిషనల్ కలెక్టర్

▶▶ పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై ప్రశ్నలు

భీమదేవరపల్లి, జనవరి 29 : జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా టీచర్ అవతారం ఎత్తారు. సోమవారం ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులను తెలుగు, గణితంలో వివిధ ప్రశ్నలు అడిగారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచనలు చేశారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉద్యోగ లక్ష్యం దిశగా ఎంచుకొని అందుకు తగ్గట్టు చదువుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం భీమదేవరపల్లిలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందులో ఏర్పాటు చేయాలని లైబ్రేరియన్ వాగు శివాజీకి సూచించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంరయ్య, విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచందర్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

నేడు కేయూలో ప్రాంగణ నియామకాలకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 29: కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని లురస్ ల్యాబ్ రిసెర్చ్ అనలిస్టులుగా పనిచేసేందుకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ క్వాలిటీ అనలటిక్స్/ఫార్మా అనలటిక్స్ పూర్తి చేసిన వారు ప్రసుత్తం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాలని, ఏడాదికి రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అకాడమిక్ ధృవపత్రాలు, సంబంధిత కళాశాల ఐడీ కార్డుతో నేరుగా ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 12

కేయూ క్యాంపస్, జనవరి 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 12 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు వచ్చేలా సహకరిస్తా

● ప్రగతి నివేదిక దారుణం ● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● అధికారుల పనితీరుపై ఆగ్రహం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 29: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వచ్చేలా సహకరిస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ కందుల రేఖ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి కడియం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి నివేదికలు చదివి వినిపించారు. నీటిపారుదలశాఖ ఏఈ యాసర్ నివేదికను అసంబద్ధంగా చదవడాన్ని గ్రహించిన కడియం రిజర్వాయర్ల దిగువన కాలువలు, తూముల మరమ్మతులను ఎందుకు చేబట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఓ చంద్రన్‌కుమార్ నివేదికను చదువుతున్న క్రమంలో ఎలాంటి పత్రాలు ఇవ్వకుండానే పాఠం లెక్క చదువుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. డాక్టర్ నివేదిక చదువుతున్న క్రమంలో ప్రభుత్వ వైద్యశాలల్లో డెలివరీల సంఖ్య ఎందుకు తక్కువగా ఉంటున్నాయని ప్రశ్నించారు. పీహెచ్‌సీలలో డెలివరీల సంఖ్యను పెంచేలా కృషి చేయా లని అలసత్వం వీడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండాల్సి ఉన్నప్పటికి ఎందుకు నిర్వహించడంలేదనేది అర్థం కావడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధి అనేది ప్రజాప్రతినిధుల వల్లనే సాధ్యమవుతుందని ప్రత్యేక అధికారుల వల్ల కాదన్నారు. తాను అధికారులను కమీషన్లు అడుగనని కేవలం పనితీరును మాత్రమే ప్రశ్నిస్తానని ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పనితీరు ఉండాలని కోరారు. ప్రస్తుత సర్పంచుల పెండింగ్ బిల్లులు అధికారులు అందించేలా చూడాలని, సర్పంచుల బిల్లులు వచ్చేలా తాను సహకరిస్తానని కడియం హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచులకు శాలువాలు కప్పి కడియం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, సర్పంచులు కోతి రేణుక-రాములుగౌడ్, జక్కుల పరుశరాములు, భూర్ల విష్ణు, పోగుల సారంగపాణి, నాగరబోయిన మణెమ్మ-యాదగిరి, ఎంపీటీసీలు ఇనుగాల రజిత రాజిరెడ్డి, గన్ను నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మండల సభలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అభివృద్ధిలో సర్పంచుల కృషి అభినందనీయం

లింగాలఘణపురం : గ్రామాల అభివృద్ధిలో 2019-24 టర్మ్‌కు చెందిన సర్పంచ్‌ల కృషి అభినందనీయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ నెల 31తో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో సోమవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో జరిగిన ఆత్మీయ అభిన ందన సభకు ఎమ్మెల్యే శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. జాతీయస్థాయి అవార్డును కైవసం చేసుకున్న నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపారాణి భూపాల్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దూసరి గణపతి, కత్తుల శ్రీపాల్‌రెడ్డి, కాటం విజయ, బూడిది జయరాజేశ్వర్, ఐల మల్లేశం, ఉంగరాల శ్రీధర్, కడారు కృష్ణ, శ్వేత, వాణి, యాదమ్మ, దేవేంద్ర, సుగుణ, భవాని, స్రవంతి, భాస్కర్, విజయ మనోహర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వం

బచ్చన్నపేట, జనవరి 29: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొట్ల చిన్న శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఇంజె ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. మోదీ అధికారం చేపట్టిన దగ్గరి నుండి కార్పోరేట్, మతతత్వ విధానాలు అవలంభిస్తూ, కార్మికులపై భారం మోపుతోందన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి అన్నెబోయిన రాజు, ఆలేటి సిద్దిరాములు, బాలరాజు, పర్వతం నర్సింహులు, మానేపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కడియంకు లేదు

(5వ పేజీ తరువాయి)

జమ అవుతాయని అన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని అన్నారు. సమావేశంలో నాయకులు బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, కమ్మగాని నాగయ్య, భైరు బార్గవ్, పట్టణ కార్యదర్శి పన్నీరు వెంకన్న, పెనుగొండ రమేష్, భూమ రంగయ్య ఉన్నారు.

హామీలు నెరవేరుస్తాం

అధికారంలోకి రెండు నెలలు కూడా ఇంకా పూర్తి కాలేదని, హామీలన్నీ నెరవేరుస్తామని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి యశస్వినిరెడ్డి హాజరై చెక్కుల పంపిణీ చేశారు.

పట్ట భద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

తరిగొప్పుల, జనవరి 29: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్ట భద్రులు ఫిబ్రవరి 6వ తేదిలోపు ఆన్‌లైన్‌లో గాని ఆఫ్‌లైన్‌లో గాని నమోదు చేసుకోవాలని తరిగొప్పుల తహసీల్దార్ కిష్టయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 11 - 2020లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ధరఖాస్తులకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునే వారు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

కొడకండ్ల : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫిబ్రవరి 6 లోగా గ్రాడ్యుయేట్‌లు తమ ఓటుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అంజయ్య కోరారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 1, 2020 లోగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ నెంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ ప్రకారం పుట్టిన తేదీ, మొబైల్ నెంబరు అవసరమని ఆయన వివరించారు.

నాలుగు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

నర్మెట, జనవరి 29 : మండలంలోని మూడు గ్రామాలు ఆగపేట, మాన్‌సింగ్‌తండా, ఇప్పలగడ్డ, గుంటూరుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆగపేట గ్రామ అధ్యక్షుడిగా కొమిరె వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గొరబోయిన కర్ణాకర్, మహిళ అధ్యక్షురాలిగా అదురి వసంత, మాన్‌సింగ్‌తండా గ్రామ అధ్యక్షుడిగా అంగోతు ఎలందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అంగోతు శేఖర్, మహిళా అధ్యక్షురాలిగా జాటోతు కమలమ్మ, ఇప్పలగడ్డ గ్రామ అధ్యక్షుడిగా ఇట్టబోయిన ప్రతాప్, యూత్ అధ్యక్షుడిగా ఇట్టబోయిన మహేష్, మహిళా అధ్యక్షురాలిగా మేకల పద్మ, గుంటూరుపల్లి గ్రామ అధ్యక్షుడిగా తుంగ యాదగిరి, యూత్ అధ్యక్షుడిగా యాదవ దీలిప్, మహిళ అధ్యక్షురాలిగా గట్టుపల్లి సంజీవల ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

జనగామ టౌన్ : పట్టణంలోని 13, 15వ వార్డుల్లో కాంగ్రెస్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. 13వ వార్డు అధ్యక్షుడిగా మిద్దెపాక స్టాలిన్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల భాస్కర్, 15వ వార్డు అధ్యక్షుడిగా మల్లోజు గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రాజబోయిన వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు.

మాదిగ ఉపకులాల భవిష్యత్తే ఎస్సీ వర్గీకరణ

నర్మెట, జనవరి 29 : సోమవారం నర్మెట మండలకేంద్రంలో ఎంఎస్‌పీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవేరబోతున్నదని కోర్టు ప్రక్రియను పూర్తి చేసుకొని త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. వర్గీకరణ ఆకాంక్ష నేరవేరే సమయంలో కుట్రలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.మాదిగలంతా ఏకమై కుట్రలను తిప్పి కొట్టేందుకు ఏకమై ఉద్యమం వైపు కదలాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాజన సోషలిస్టు పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కంతి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా పెద్దమ్మ ప్రవీణ్, జల యాదగిరి, ఎనగందుల గణేష్, అధికార ప్రతినిధిగా మొండితోక నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి కంతి రవికుమార్, కార్యదర్శి ఆకునూరి స్వామిదాస్, బచ్చాల రమేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సందేన రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేరుపోతుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

31న ఉమ్మడి జిల్లా స్థాయి కామర్స్ మీట్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 29: ఈ నెల 31న ఉమ్మడి జిల్లా స్థాయి కామర్స్ మీట్ స్టేషన్ ఘన్‌పూర్ విద్యా జ్యోతి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ తెలిపారు. సోమవారం కళాశాలలో మీట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. జెనిత్ టుకే 24 పేరుతో కామర్స్ మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా బెస్ట్ స్టూడెంట్, కామర్స్ క్విజ్, బ్యాలెన్స్ షీట్ కా బాద్‌షా, పోస్టర్ ప్రెజెంటేషన్, కామర్స్ ఎగ్జిబిషన్, బిజినెస్ ప్లాన్, యాడ్ మేనియా తదితర అంశాలతో పాటు గ్రూప్ డ్యాన్స్, స్పాట్ డ్యాన్స్, జానపద, శాస్త్రీయ గీతాలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9618617916, 9949107167 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం హెడ్ మధుబాబు, ఇన్‌చార్జీలు లత, ప్రత్యూష, సునీత పాల్గొన్నారు.

3న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

జనగామ టౌన్, జనవరి 29: ఈ నెల 31న కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి జిల్లా అధికారి ఉమారాణి ప్రకటించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల్లో మెషిన్ ఆపరేటర్, అసెంబ్లింగ్ ఆపరేటర్ల కోసం 280 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీకి ఐటీఐ, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 31న కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయానికి ఉదయం 10.30 గంటల లోపు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 79954 30401 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతర సాకుతో అధికంగా బెల్లం తరలిస్తే కేసులు

చిలుపూర్, జనవరి 29 : వన దేవతల జాతర మాటున బెల్లం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని మల్కాపూర్ - లింగంపల్లి గ్రామాల సమీపంలోని కొమ్ముగుట్ట క్రాస్‌రోడ్ వద్ద అధికంగా బెల్లం, పటికను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఫతేపూర్‌కు చెందిన గుగులోతు ప్రవీణ్, లక్పతి, హుస్నాబాద్‌కు చెందిన పవన్‌లు వారివారి వాహనాల్లో తరలిస్తున్న 23 క్వింటాళ్ళ నాటుసారాకు వినియోగించే బెల్లంతో పాటు, 6 క్వింటాళ్ళ పటికను పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలు, బెల్లం పటికను సీజ్ చేయడంతో పాటు, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఎస్సై నరేష్‌కుమార్, డీటీఎఫ్ ఎస్సై మధు, సిబ్బంది యాకూబ్, సంజీవరావు, దస్తగిరి, సలీమ్, బహదూర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కరుణాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుల వద్ద పట్టుకున్న బెల్లం, పటికతో అధికారులు

రెండు గ్రామాల్లో భవనాల ప్రారంభోత్సవాలు

బచ్చన్నపేట, జనవరి 29: మండలంలోని పోచన్నపేట, చిన్నరామన్ చర్ల గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. చిన్నరామన్‌చర్లలో జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ అంజయ్య, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజులు జీపీ భవనాన్ని ప్రారంభించారు. ఇందుకు కృషి చేసిన సర్పంచ్ ఎండీ ఖలీల్‌బేగం ఆజాంను అభినందించారు. అలాగే పోచన్నపేటలో సుమారు కోటిన్నరతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం, మన ఊరు-మనబడిలో భాగం గా అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలను సర్పంచ్ గట్టు మంజుల మల్లేశం ప్రారంభించారు. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వన దేవతల జాతరలను వైభవంగా నిర్వహించాలి

చిలుపూర్, జనవరి 29 : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతరలను వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర కుమారుడు ఇమ్మాన్యుయేల్ రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీపతిపల్లి - కొండాపూర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో నెలకొన్న వన దేవతలను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం జాతరలో చేపట్టాల్సిన పనులతో పాటు, సమకూర్చాల్సిన కనీస మౌళిక సదుపాయాలను కమిటీ బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీపతిపల్లిలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందిన బాషబోయిన యాదగిరి కుటుంబాన్ని ఇమ్మాను యేల్ రాజ్ సందర్శించారు. యాదగిరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీటీసీ దయాకర్, కాసాని బొందయ్య, పుట్ట రాజు, గాలి రాజుయాదవ్, మండల ఇన్‌చార్జి మహేందర్, కండ్లకోలు బాలరాజు, తౌటి సునీల్, వద్యూరి మౌనిక, జోడుముంతల అరుణశోభ, నరేష్ తదితరులు పాల్గొన్నారు

ఆంగ్ల ప్రతిభా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయికి ఎంపికైన బాలికలను అభినందిస్తున్న కేజీబీవీ ఎస్ఓ స్వప్న

జఫర్‌గఢ్, జనవరి 29 : ఇంగ్లీషు ప్రతిభా పోటీల్లో మండలంలోని బాలబాలికలు ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఇంగ్లీషు లిటరసీ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో సోమవారం జఫర్‌గడ్‌లో ఆయా హైస్కూల్ విద్యార్థులకు ఇంగ్లీషు డ్రామా, స్పెల్ విజర్డ్ అనే రెండు అంశాల్లో మండల స్థాయి ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంగ్లీషు డ్రామా విభాగంలో జఫర్‌గడ్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన అనురాధ బాలికల జట్టు, స్పెల్ విజర్డ్ విభాగంలో ఉప్పుగల్లు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇ.సాయితేజ (9వ తరగతి) బాలుర జట్టు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకోవడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలను ఎల్టా మండల కో-ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, కస్తూర్బా ఎస్ఓ స్వప్న, హెచ్‌ఎంలు పి.కిషన్‌కుమార్, గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు బాధ్యతను పెంచింది..

విద్యుత్ డీఈఈ హుస్సేన్‌నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 29: విద్యుత్‌శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యుత్ అధికారిగా ఎంపిక చేసి అవార్డు అందించడం తన బాధ్యతను మరింత పెంచిందని స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ విద్యుత్ డీఈఈ హుస్సేన్‌నాయక్ తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలో విద్యుత్ శాఖ ఏడీఏ కార్యాలయం అవరణలో ఐఎన్‌టీయూసి 327 రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ ఆధ్వర్యంలో డీఈఈని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ సట్ల రాజు, ఏడీఏ సత్యనారాయణ, ఏఈలు పులి చంద్ర మోహన్, శివకుమార్, నాగలక్ష్మి, ఏఏఓ స్వర్ణలత, రాజ్‌కుమార్, రాజేందర్, లైన్‌మెన్‌లు వాసం శ్రీధర్‌పటేల్, గబ్బెట సుధాకర్, కృష్ణంరాజు, సందీప్, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

చిలుపూర్, జనవరి 29 : ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చిన్నపెండ్యాలలో హైవేపై జరిగింది. సోమవారం ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణానికి చెందిన ఆశబోయిన రమేష్ వ్యక్తిగత పని నిమిత్తం తన స్నేహితుడితో కలిసి హనుమకొండకు వెళ్ళాడు. తిరుగు పయనంలో తిరిగి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తుండగా చిన్నపెండ్యాల బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌కు తాకి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రమేష్ కాలు విరగడంతో పాటు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి మల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులిద్దరిని చికిత్స నిమిత్తం 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మూఢ విశ్వాసాలను నమ్మొద్దు

జనగామ టౌన్, జనవరి 29: మూఢ విశ్వాసాలను నమ్మవద్దని రిటైర్డ్ కర్నల్, మాజీ సైనికుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి, జన విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు రమేశ్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏకశిల డిగ్రీ కళాశాలలో మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది సాధిక్ అలీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, ప్రజా కళాకారుడు సాంబరాజు యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, యాకన్న, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలకు గానుగుపహాడ్ విద్యార్థి


సందీప్

జనగామ టౌన్, జనవరి 29: రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పోటీలకు జనగామ మండలంలోని గానుగుపహాడ్ జడ్పీఎస్ఎస్ విద్యార్థి రెడ్డబోయిన సందీప్ ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో సందీప్ ప్రతిభ చాటాడు. ఈ నెల 31న నిజామాబాద్‌లో గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నాడు.

నేడు చిలుపూర్ మండల సర్వసభ్య సమావేశం

చిలుపూర్, జనవరి 29 : నేడు చిలుపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత - బాలరాజు అధ్యక్షతన, ఉదయం 11 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతున్నందున మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

● రఘునాథపల్లి : నేడు రఘునాథపల్లి మండల సర్వసభ్య సమావేశం జరుగనుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహిస్తున్న మండల సభలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. దీంతో సమస్యలు పరిష్కారానికి ఆమడ దూరంలోనే నిలిచిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు జరిగే మండల సభలోనైనా సమస్యలు పరిష్కారమవుతాయా అని పలువురు చర్చించుకుం టున్నారు. మండల సభలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా నిర్వహించ డానికి అటు ప్రజాప్రతినిధులు. .ఇటు అధికారులు అంకిత భావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల, జనవరి 27 : మండలకేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ గురుకుల కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఈ నెల 31 నుంచి మార్చి 16 వరకు విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొడకండ్లలోని టీఎస్ఆర్ఎస్ జనరల్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.

పాఠశాలకు వాటర్ ట్యాంకు అందజేత

రఘునాథపల్లి, జనవరి 29: మండలంలోని కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇదే పాఠశాలలో 2000-2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం వాటర్ ట్యాంకును బహూకరించారు. తాము విద్యనభ్యసించిన పాఠశాలకు తమ వంతుగా చిన్న సహాయం చేయాలనే లక్ష్యంతో వాటర్ ట్యాంక్‌ను బహూకరించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు సతీష్, అశోక్, మల్లేష్, యాకుబ్, కుమారస్వామి, పాషా, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ

జఫర్‌గడ్, జనవరి 29 : గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) నూతన సంవత్సర క్యాలండర్లను సోమవారం జఫర్‌గడ్‌లో సంఘం ప్రతినిధుల సమక్షంలో స్థానిక ఎస్ఐ మహేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఎంపీఎస్ జిల్లా ప్రతినిధి ఎక్కల రాజబీరయ్య, మండల అధ్యక్షుడు కత్తుల రాజు, జఫర్‌గడ్ టౌన్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు గజ్జి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

రఘునాథపల్లి, జనవరి 29: చిన్నారుల స్థాయికి అనుగుణంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని లక్ష్మీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలల సంరక్షణ విద్య దినోత్సవం పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో తీసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆకర్షణీయంగా తయారు చేసిన అభ్యసన మూలాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజుల, సర్పంచ్ లావణ్యకుమార్, శ్రీహరి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు కోసం ఆకర్షణీయంగా తయారు చేసిన అభ్యసన మూలాలు

ప్రజాప్రతినిధుల కృషితోనే గ్రామాల అభివృద్ధి

- జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి

బచ్చన్నపేట, జనవరి 29: గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీల కృషితోనే అభివృద్ధి సాధ్యపడిందని జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అంజయ్య అన్నారు. సోమవారం ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటికి ప్రజాక్షేత్రంలో నిత్యం ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. కాగా సర్వసభ్య సమావేశంలో పలు శాఖల పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బచ్చన్నపేట సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం అవినీతికి నిలయంగా మారిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్‌కు వస్తే నాసిరకంగా తయారుచేసి పంపటంలో పదేపదే షెడ్డుకు వస్తున్నాయన్నారు. మొక్కలకు నీళ్ల పోసేందుకు ట్యాంకర్లను ఉపయోగించడం మూలంగా మెయింటెన్స్ ఖర్చు తమకు భారంగా మారిందని, ఏడాది బిల్లులు ఆపితే ఎలా నెట్టుకురాగలమంటూ సర్పంచ్‌లు ప్రశ్నించారు. బచ్చన్నపేటలో పీహెచ్‌సీ, సీఎస్‌సీ ఆస్పత్రులుండగా, సమావేశానికి వాటి బాధ్యులు హాజరుకాకుండా, సూపర్‌వైజర్‌లను పంపించటమేంటని ఆలీంపూర్ ఎంపీటీసీ మసూద్ ప్రశ్నించారు. పలు గ్రామాల్లో రేషన్ షాపులకు డీలర్లు లేక ఇబ్బంధులు పడుతున్నారని తెలిపారు. సమావేశం అనంతరం పదవీకాలం ముగియనున్న సర్పంచ్‌లను జడ్పీచైర్‌పర్సన్, ఎంపీపీ, అధికారులు సన్మానించారు. సభ ప్రారంభంలో జడ్పీ చైర్మెన్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన పాగాల సంపత్‌రెడ్డికి సభ్యులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పాలకుర్తి, జనవరి 29 : ఫిబ్రవరి 11, 12, తేదీల్లో ఖమ్మంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు ఇమ్మడి అశోక్ మాట్లాడారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఈ విద్యా వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటనర్సయ్య, శేషగిరిరావు ఉన్నారు.

మొబైల్ లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు

జనగామ టౌన్, జనవరి 29: జిల్లాలో మొబైల్ లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024-25 వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో మొబైల్ లైబ్రరీల ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవడుతుందని, మానసిక వికాసం మరింత పెంపొందుతుందని చెప్పారు. సమావేశంలో డీపీవో రంగాచారి, డీఈవో రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.